సాక్షి చిత్తూరు

శనివారం । 29 । మార్చి । 2025



ఎందుకీ 'నీరుసం'

పుంగనూరు నియోజకవర్గంపై కూటమి నర్కారు కుట్ర పన్నింది. నీటి పథకాలకు నీరివ్వకుండా నీరసించేలా చేస్తోంది. - IIలో



పంటలపై గజదాడులు

గుడిపాల మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగులు పంటలపై దాడులు చేసి, ధ్వంసం చేశాయి. - IIలో



న్యూస్‌రీల్

చెట్లు మనం నాటితే.. వైఎస్సార్ సీపీ వారు కాయలుకోస్తారు!

–ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): 'చెట్లు మనం నాటితే వైఎస్సార్‌సీపీ వారు కాయలుకోస్తారు.' అంటూ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్న మాటలు చిత్తూరులో చర్చనీయాంశమయ్యాయి. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటనలో భాగంగా చిత్తూరు నగరంలోని వన్‌డిపో ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. కొబ్బరి మొక్క నాటుతున్న సమయంలో చెట్లు మనం నాటితే.. వైఎస్సార్‌సీపీ వారు కాయలు కోస్తారంటూ ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఓ నవ్వు నవ్వారు. దీంతో అక్కడున్న కొందరు మహిళలు 'అన్నా మనం ఇంకొసారికి అధికారంలోకి రామా' అంటూ అడిగారు. అందుకు ఆయన నవ్వుతూ చెట్లు నాటి నీళ్లు పోశారు. ఇక మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్ చర్చ మధ్యలో ఆర్టీసీలో బస్సు టైర్లు మార్చడానికి డబ్బులు లేవని నవ్వులు పూయించారు.

పది పరీక్షల్లో విద్యార్థి డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వి.కోట మండలం జెడ్పీ బాలుర హైస్కూలులో చూచిరాతలకు పాల్పడుతున్న ఓ విద్యార్థిని డిబార్ చేసినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీన పదో తరగతి బయాలజీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 21,143 మంది విద్యార్థులకుగాను 20,895 మంది హాజరై 248 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. డీఈఓ 2, ఫ్లయింగ్ స్క్వాడ్ 15 మంది 19 పరీక్ష కేంద్రాలను పరిశీలించారన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు.

పది సోషల్ పరీక్ష వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీన నిర్వహించాల్సిన పదో తరగతి సోషల్ పరీక్షను వాయిదా వేశారని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ప్రకారం సోషల్ పరీక్ష ఈ నెల 31వ తేదీన జరగాల్సి ఉంది. అయితే ఆ రోజు రంజాన్ పండుగ రావడంతో పరీక్షను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వాయిదా వేసిన సోషల్ పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరారు.

విద్యుత్ ప్రమాదాల నుంచి వన్యప్రాణులకు రక్షణ



బంగారుపాళెంలో ఎత్తు పెంచిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం: పొలాలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్య ప్రాణులు విద్యుత్ షాక్‌కు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పొలాలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు పెంచే పనులను ఈఈ మునిచంద్రతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు డివిజన్ పరిధిలోని బంగారుపాళెం, యాదమరి మండలాల్లో అటవీ సరిహద్దుల్లోని పొలాల వద్ద తక్కువ ఎత్తులో ఉన్న 20 ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు ఎత్తు పెంచినట్లు తెలిపారు. బంగారుపాళెంలో 70 ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు, పొలాల వద్ద ఉన్న విద్యుత్ తీగలు కారణంగా వన్యప్రాణులు కరెంట్ షాక్ గురై మృత్యువాత పడిన నేపథ్యంలో ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య, రూరల్ ఏఈ హేమచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్‌బ్రాంచ్‌లో పలువురికి స్థానచలనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలోని స్పెషల్ బ్రాంచ్‌లో పలువురిని బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. స్థానచలనం పొందినవారిలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారు కొందరు, పలుసార్లు ఇదే శాఖలో పనిచేస్తున్న మరి కొందరు ఉన్నారు. మొత్తం ఆరుగురిని పలు స్టేషన్లకు బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చారు.

అదో చిన్న స్థానిక సంస్థ పదవి.. ఓ మండలానికే పరిమితం.. దాన్ని కైవశం చేసుకోవడానికి కూటమి నేతలు పలు అడ్డదారులు తొక్కారు.. కుట్రలు.. కుతంత్రాలు.. కుయుక్తులు చేశారు. కూటమి ప్రజాప్రతినిధులు, బడా నేతలు చేసిన జుగుప్సాకర రాజకీయాలు జనానికి సైతం ఏవగింపు అనిపించాయి. మొత్తంగా వారి చేష్టలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయి.



ప్రజాస్వామ్యం అపహాస్యం



- ఆ నాలుగు గంటలు.. అడుగడుగునా ఆటంకాలు
- రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికివేసి అడ్డుకునే ప్రయత్నం
- కావేరీ జలాలకు ధర్నా పేరుతో హైడ్రామా
- 20 నిముషాల ప్రయాణానికి 4 గంటలు ట్రాఫిక్ సమస్య సృష్టి

కుప్పం: మెజారిటీ ఎంపీటీసీ సభ్యులతో సంపూర్ణ ఆధిక్యత ఉన్న వైఎస్సార్‌సీపీని అడ్డుకునేందుకు టీడీపీ శతవిధాలా అడ్డదారులు తొక్కింది. ఎలాగైనా రామకుప్పం ఎంపీపీ స్థానాన్ని కైవశం చేసుకునేందుకు అధికార పార్టీ కుట్రలు కుతంత్రాలుచేసి, అధికారబలం ప్రదర్శించి, అడ్డుకుంది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ఎన్నికల ప్రాంగణానికి రా కుండా చేసి, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ ఎన్నికను ముగించారు.

ఏకమైన అధికార పార్టీ క్యాడర్

రామకుప్పం ఎంపీపీ ఎన్నిక నిర్వహణపై ముందస్తుగా అధికార పార్టీ తెలుగుదేశం ప్రణాళిక రచించుకుంది. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల క్షేత్రస్థాయి కార్యకర్తల నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు రామకుప్పం గ్రామానికి తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎక్కడ ఉన్నారో తెలుసుకుని, వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వి.కోట నుంచి వస్తుండగా అన్నవరం, కారుకుంట, చెల్దిగానిపల్లి, గంధారమాకులపల్లి ప్రతి గ్రామం వద్ద టీడీపీ క్యాడర్ నినాదాలు చేస్తూ పోలీసు వాహనంలో వచ్చే ఎంపీటీసీ సభ్యులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం రాజుపేట రోడ్డు నుంచి రామకుప్పం వరకు చేపట్టిన ధర్నాలతో సభ్యులు ఎన్నికలకు హాజరు కానీయకుండా చేశారు.

కావేరీ జలాల కోసం ధర్నా డ్రామా

రామకుప్పం– వి.కోట మధ్య రాజుపేట రోడ్డు కర్ణాటక పరిధిలోకి వస్తుంది. దీంతో అక్కడ పచ్చ నేతలు కావేరీ జలాల కోసం ధర్నా పేరుతో డ్రామా ఆడారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. వీరిని అడ్డుకునేందుకు రాజుపేట రోడ్డులో కావేరీ జలాలను తీసుకురావాలని ధర్నా పేరుతో అడ్డగించారు. కర్ణాటకకు చెందిన కొందరు రైతులతో పాటు 4 మండలాల టీడీపీ క్యాడర్ మొత్తం ఒకటై ధర్నాకు మద్దతు పలికారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి, చెట్లు నరికి వేసి, ఒకటిన్నర గంట సమయం ట్రాఫిక్ సమస్య సృష్టించారు. కేవలం వి.కోట నుంచి రామకుప్పం ఎన్నికల కార్యాలయం వద్దకు 20 నిముషాల్లో జరగాల్సిన ప్రయాణం 4 గంటలు కొనసాగేందుకు పచ్చనేతలు పన్నాగం పన్నారు. రాజుపేట రోడ్డు నుంచి రామకుప్పం వరకు 5 కిలోమీటర్ల దూరం వాహనాలు, ద్విచక్ర వాహనాలను అడ్డం పెట్టి, ట్రాఫిక్ సమస్య సృష్టించారు. 8 మంది ఎంపీటీసీ సభ్యులతో వస్తున్న పోలీసు వాహనం ఎటూ వెళ్ల లేని స్థితి నెలకొంది. దీంతో ఎంపీసీటీ సభ్యులు ఎన్నికల సమయానికి హాజరుకాలేకపోయారు.

ఊహకందని విషయంపై రచ్చ

బెంగళూరు నుంచి హోసూరు మీదుగా తమిళనాడు వెళ్లే కావేరీ కాలువలు కర్ణాటక రాష్ట్రం ఓ మూలన ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని రామకుప్పం వద్ద ఉన్న రాజుపేటరోడ్డుకు రావాలని ధర్నా చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ విషయం ఊహకందని రచ్చ స్థానికులు అంటున్నారు. కేవలం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను ఇబ్బంది పెట్టేందుకు టీడీపీ పన్నాగమే తప్ప, కావేరీ జలాలు రాజుపేట రోడ్డుకు రావడం అసాధ్యమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అడుగడుగునా ఆటంకాలు

రామకుప్పం మండలంలో 16 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 8 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారు. టీడీపీకి ఆరుగురు ఉండగా ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. అధికార పార్టీ నేతలు బెదిరింపులు, ప్రలోభాలు పెట్టి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు 8 మంది ఎంపీటీసీ సభ్యులను కర్ణాటకకు తరలించారు. అక్కడి నుంచి గురువారం ఉదయం వి.కోటలోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్వగృహానికి తరలించారు. ఎంపీపీ ఎన్నిక కోసం 11 గంటలలోపు ఎంపీటీసీ సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. వి.కోట నుంచి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రామకుప్పం బయలుదేరగా మార్గం మధ్యలో టీడీపీ శ్రేణులు అడుగడుగునా అడ్డుకున్నారు. సమయానికి ఎన్నికల కార్యాలయానికి రానీయకుండా ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించారు.



ధర్నా చేస్తున్నట్లు నటిస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)

ఆ మూడుచోట్ల నిలిచారు.. గెలిచారు

చిత్తూరు జిల్లాలోని సదుం, తవణంపల్లి, తిరుపతి జిల్లాలోని తిరుపతి రూరల్ మండలపరిషత్ అధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నేతలు పలు విధాలుగా ప్రలోభాలకు గురిచేసినా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు పార్టీకి విధేయులుగా నిలిచారు. మండలాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- పుంగనూరు నియోజకవరంలోని సదుం మండలంలో పది మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఇందులో ఇద్దరు మరణించగా మిగిలిన ఎనిమిది మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన మాధవిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని తవణంపల్లి మండలంలో 15 ఎంపీటీసీ స్థానాల్లో కేవలం ఒకే ఒక్క స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఉప ఎన్నికలో 14 మంది ఎంపీటీసీలు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన ప్రతాప్‌సుందర్ రాయల్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయపురం మండల ఉపాధ్యక్షురాలిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన కన్నెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పెనుమూరు మండల కో–ఆప్షన్ సభ్యులుగా వైఎస్సార్‌సీపీ బలపరచిన నసీమాను ఎన్నుకున్నారు.
- తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్ మండలంలో మొత్తం 37 మంది ఎంపీటీసీలు ఉంటే, ఇద్దరు హాజరు కాలేదు. మిగిలిన 35 మందిలో 34 మంది వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. ఒకే మాటపై ఉండి ఎంపీపీని గెలిపించుకున్నారు.

రెండు ఏఎంసీలకు చైర్‌పర్సన్ల నియామకం

చిత్తూరు అర్బన్: జిల్లాలోని రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్‌పర్సన్లను నియామకం జరిగింది. ఈ మేరకు నగరికి డి.రాజమ్మ, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం ఏఎంసీకి జి.జయంతిని చైర్‌పర్సన్లుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఊరిస్తూ వచ్చిన మార్కెట్ కమిటీల చైర్‌పర్సన్ల నియామకంలో కూటమి నేతలకు ఈసారి కూడా నిరాశే ఎదురైంది. జిల్లాలో పది వ్యవసాయ మార్కెట్ కమిటీలుంటే.. కేవలం రెండు చోట్ల మాత్రమే చైర్‌పర్సన్లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండూ కూడా టీడీపీకే కేటాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. కాగా జిల్లాలో కుప్పం, పుంగనూరు, రొంపిచెర్ల, సోమల, చిత్తూరు, పలమనేరు, పెనుమూరు, బంగారుపాళెం కమిటీలకు చైర్‌పర్సన్లను ప్రకటించలేదు. దీంతో పదవులు ఆశిస్తున్న ఆశావహుల్లో మరోసారి నిరాసక్త నెలకొంది. ఇప్పటికే ఖరారైన రిజర్వేషన్లు పాటిస్తారో..? మళ్లీ ఏదైనా మారుస్తారా..? కూటమిలో భాగస్వామ్యమైన బీజేపీ, జనసేనకు న్యాయం చేస్తారా..? అనే అనుమానం కూటమి నేతలను వెంటాడుతోంది.

మాతృమరణాలు నివారించాలి



మాట్లాడుతున్న డీఐఓ హనుమంతరావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతృమరణాలు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఐఓ హనుమంతరావు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం మాతృమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వి.కోట గ్రామానికి చెందిన ఓ గర్భిణి బీపీ ఎక్కువై, గుండె నొప్పి రావడంతో 108లో తరలిస్తున్న సమయంలో మృతి చెందిందన్నారు. ఇలాంటి కేసులు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉషశ్రీ, లత, రమ్య, అనూష, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం ఇంకెన్ని రోజులు?



మాట్లాడుతున్న విజయానందరెడ్డి. చిత్రంలో చంద్రశేఖర్

చిత్తూరు కార్పొరేషన్: ప్రశ్నించే గొంతుకపై కేసులు పెట్టి ఇంకెన్ని రోజులు రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు మీరు చెప్పిన హామీలను అమలు చేయకపోవడంతో వాటిని ప్రశ్నించిన అధ్యాపకుడిపై అక్రమంగా కేసు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐరాల మండలం కాణిపాకం గ్రామానికి చెందిన జ్యోతికుమార్ ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. పేద విద్యార్థుల బాధ చూడలేక అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ఇస్తారని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారన్నారు. దానిపై కక్ష గట్టిన అధికార పార్టీ నాయకులు అతనిపై సారా తరలిస్తున్నారని పోలీసులతో కేసు పెట్టించడం ఎంతవరకు న్యాయమన్నారు. ప్రశ్నించే గొంతుకపై కేసులు పెట్టి ఇంక ఎన్ని రోజులు రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తామని ఎన్నికలప్పుడు హామీలిచ్చారు.. వాటి అమలును అడిగితే కేసులు పెట్టే కొత్త పద్ధతిని టీడీపీ నాయకులు ప్రవేశపెట్టారన్నారు. ఇటువంటి తప్పుడు కేసులతో సభ్యసమాజానికి ఎటువంటి సందేశం ఇస్తారని ప్రశ్నించారు. ఏ రాజకీయపార్టీ అయినా చేసిన తప్పులను సోషల్‌మీడియా వేదికగా ఎత్తి చూపడం సహజంగా జరిగే ప్రక్రియ అన్నారు. అలానే అధ్యాపకుడు అడిగితే అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. అతను భవిష్యత్‌లో ఎలా తలఎత్తుకుని తిరగగలరని అన్నారు. సోషల్ మీడియా పోస్టులపై 111 సెక్షన్ వర్తించదని కోర్టు చెబుతున్నా పోలీసులు అక్రమంగా కేసుపెట్టారన్నారు. ఇలాగే ఉంటే పోలీసులపై పూర్తిగా నమ్మకం పోతుందని ఎస్పీకి సూచించారు. వీటిని విద్యావేత్తలు సహించరన్నారు. ఇలాగే తప్పుడు కేసులు కొనసాగితే భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, నాయకులు అంజలిరెడ్డి, మధురెడ్డి, చాన్‌బాషా, అప్పాజీ, ప్రసాద్‌రెడ్డి, ప్రతిమారెడ్డి, నౌషాద్, స్టాండ్లీ, వెంకటేష్, హరీషారెడ్డి, మదన్, సంపత్, రాజేష్, రంజిత్, మురళీ, రమేష్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటానికే ప్రారంభోత్సవం

- రమ్మన్నారు...బయటే కూర్చోబెట్టారు!
- ఇంత మాత్రానికి ఎందుకు రమ్మన్నారని మహిళలు మండిపాటు
- ప్రారంభించిన భవనాన్నే మళ్లీ ప్రారంభించిన ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ



ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చి, బయట కూర్చుని ఉన్న మహిళలు



గతంలో ప్రారంభించిన భవనాన్ని మరోసారి ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న పూలే భవనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించారు.. అదే భవనాన్ని ప్రస్తుతం మళ్లీ ప్రచార ఆర్భాటం కోసం ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఆ భవనానికి గత వైఎస్సార్‌సీపీ సర్కారు రూ.4.43 కోట్లు ఖర్చు చేసి, పనులు పూర్తి చేసి ప్రారంభించిన విషయం విదితమే. అయితే ప్రస్తుతం కూటమి అదనపు భవనాల ప్రారంభోత్సవమంటూ ఆర్భాటం చేసి, ప్రచారం కోసం తిరిగి మళ్లీ భవన ప్రారంభోత్సవం చేయడం విమర్శలకు తావిచ్చింది.

ప్రారంభోత్సవానికి రమ్మన్నారు అవమానించారు!

పూలే భవన నిర్మాణం ప్రారంభోత్సవానికి ఇన్‌చార్జ్ మంత్రి వస్తున్నారు డ్వాక్రా గ్రూపుల మహిళలను తప్పనిసరిగా రావాలని పలు శాఖల అధికారులు ఆదేశించారు. దీంతో జిల్లా కేంద్రానికి చుట్టుపక్కన ఉన్న మండలాల నుంచి మహిళలు కార్యక్రమానికి విచ్చేశారు. అయితే ఆ మహిళలు భవనం లోపల కూర్చునేందుకు కుర్చీలు వేయకపోవడంతో బయటే కింద కూర్చున్నారు. కార్యక్రమం అయ్యే వరకు ఆరుబయటే నిరీక్షించారు. కార్యక్రమానికి పిలిపించి అవమానిస్తారా? అంటూ పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ధోరణి సరికాదని డ్వాక్రా మహిళలు మండిపడ్డారు.

అధికారిక కార్యక్రమం.. పచ్చ నేతల కార్యక్రమంగా..

పూలే విగ్రహ ఆవిష్కరణ, పూలే భవన ప్రారంభోత్సవం, విభిన్నప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం అధికారిక కార్యక్రమం. అయితే ఈ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు పచ్చపార్టీ కార్యక్రమంగా మార్చేశారు. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం అర్హత ఉన్న ప్రజా ప్రతినిధులు మాత్రమే స్టేజీపై కూర్చోవాల్సి ఉంది. అయితే శుక్రవారం నిర్వహించిన పూలే భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్టేజీపై ఎలాంటి అర్హత లేని పచ్చనేతలు దర్శనమిచ్చారు. ఈ సన్నివేశాన్ని చూసిన ప్రజలు ఇదేమి విచిత్రమోనని? ముక్కున వేలు వేసుకున్నారు.

గొప్పలు ఊదరగొట్టిన ఇన్‌చార్జ్ మంత్రి

ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కార్యక్రమంలో గొప్పలు చెప్పుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమి లేకపోయినా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఎన్నో చేశామంటూ ప్రసంగంలో ఊదరగొట్టారు. ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కూటమి కృషి చేస్తోందన్నారు. దేశంలో బీసీల సంక్షేమానికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. వారి సేవలను నిరంతరం స్మరించుకోవాలని తెలిపారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్‌గా కాకుండా బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా భావిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధికి అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ అన్ని హంగులతో మహాత్మా జ్యోతిరావు పూలే భవన్‌ను నిర్మించుకున్నామన్నారు. ఈ భవనంలో భవిష్యత్తులో పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. బీసీల అభ్యున్నతికి అవసరమైన పలు సమావేశాలు, పోటీ పరీక్షల నిర్వహణకు అవసరమైన శిక్షణ తరగతులు, సామాజిక కార్యక్రమాలు నిర్వహణకు బీసీ భవన్‌ను ఉపయోగిస్తామన్నారు. సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో 301 మంది విభిన్నప్రతిభావంతులకు వివిధ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీభాషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బండికి భారం.. ఈ ప్రయాణం నేరం



సురక్షితంగా గమ్యం చేరాలంటే రోడ్డు భద్రత నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలి. లేదంటే ఉల్లంఘనులకే నష్టం. ఏమాత్రం పట్టు జారినా పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా ఐదుగురు ఒకే వాహనంలో ప్రమాదపుటంచున ఇలా వెళ్లడం చూసేవారిని సైతం ఆశ్చర్యానికి గురి చేసిన సంఘటన కార్వేటినగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ దృశ్యం చూసిన వారంతా ఇలా ప్రయాణం చేస్తే ప్రమాదాలు జరగవా? అన్నారు. - కార్వేటినగరం

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని హుండీ ద్వారా ఆలయానికి రూ. 1.34కోట్ల ఆదాయం వచ్చిందని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం ఉదయం లెక్కించారు. ఇందులో గోసంరక్షణ హుండీ ద్వారా రూ.7,300, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.40,404 వచ్చిందన్నారు. యూఎస్ఏవీ 620 డాలర్లు, ఇంగ్లాడ్‌వి 10 పౌండ్స్, యూరోవి 10 యూరోలు, కెనడావి 50 డాలర్లు, ఆస్ట్రేలియావి 20 డాలర్స్, మలేషియావి 4 రింగిట్స్, సింగపూర్‌వి 11 డాలర్స్ వచ్చాయన్నారు. బంగారం 31 గ్రాములు, వెండి 2.420 కిలోలు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ, ఏఈఓలు కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్



స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

గంగవరం: చెరువులో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ మట్టి దందాను గంగవరం పోలీసులు అడ్డుకుని కూటమి నాయకులకు చెందిన జేసీబీ, 10 ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలంలోని మేలుమాయి, మబ్బువారిపేట గ్రామాల సమీపంలోని చెరువులో పలువురు కూటమి నాయకులు కొన్నాళ్లుగా అక్రమంగా జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో రియల్ వ్యాపారాలకు తరలించి, రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలించకూడదనే నిబంధనలున్నా వాటిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు పోలీసులు చెరువులో మట్టి తవ్వకాలపై దాడులు జరిపి, జేసీబీ, 10 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం రెవెన్యూ అధికారులకు నివేదిక పంపినట్టు సీఐ ప్రసాద్ తెలిపారు.

పంటలపై గజదాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన రాతి కూసాలు

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు, బొమ్మసముద్రం గ్రామాల్లో వరి, మామిడి, అరటి పంటలను శుక్రవారం తెల్లవారుజామున మూడు ఏనుగులు తమిళనాడు నుంచి వచ్చి ధ్వంసం చేశాయి. బొమ్మసముద్రంలో రాతికూసాలు, బోరు పైపులను కూడా ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. చిత్తూరు డివిజన్ తూర్పు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ థామస్ శుక్రవారం సాయంత్రం బొమ్మసముద్రం, గొల్లమడుగు, కనకనేరిలో ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఏనుగులు వెళ్లిన జాడలను పరిశీలించారు. రాత్రి వేళల్లో ఎవరూ పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఏనుగుల జాడ తెలిసిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. తమ సిబ్బందితో కలిసి ఏనుగుల జాడను కనిపెట్టి తమిళనాడు ప్రాంతానికి తరలిస్తామన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రభాకర్‌రెడ్డి, మధు ఉన్నారు.

ఎందుకీ నీరుసం

పుంగనూరుపై కూటమి కుట్రపన్నింది. నీటి పథకాలు నీరసించేలా చేస్తోంది. జలజీవన్ కింద నిర్మించిన ట్యాంకులకు నీరొదలకుండా చేస్తోంది. అసంపూర్తి పనులను అటకెక్కిస్తోంది. కొన్ని పథకాలను కూల్చేసింది. మొత్తంగా పుంగనూరు నియోజకవర్గానికి వెక్కిళ్లు తెప్పిస్తోంది. జనానికి జలవేదన మిగుల్చుతోంది. కలెక్టర్ అయినా స్పందించాలని జనం ఘోషిస్తున్నారు.

- పుంగనూరుకు కన్నీటి కష్టాలు
- ట్యాంకులకు నీళ్లు వలదని వైనం
- ప్రభుత్వానికి పట్టని గ్రామీణ సమస్యలు





పుంగనూరులో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(ఫైల్), రొంపిచెర్ల మండలంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ట్యాంకు(ఫైల్)

పుంగనూరు: పుంగనూరు నియోజవర్గానికి నీటి గండం వచ్చింది. నీటి వనరులు పుష్కలంగా ఉన్నా కూటమి పాపం కారణంగా ప్రజలకు నీటి సమస్య తప్పడం లేదు. పుంగనూరు నియోజవర్గంలో నీటి సమస్య లేకుండా చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ జలజీవన్ మిషన్ పథకం కింద మొత్తం 529 ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించి, పైపులైన్లు, బోర్లు వేశారు. ఇందుకు రూ.87 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కానీ ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పది నెలలుగా ట్యాంకులకు నీరు వదలకపోవడం, పెండింగ్‌లో ఉన్న ట్యాంకుల నిర్మాణం చేపట్టపోవడం, పైపులైన్లు వేయకపోవడంతో సుమారు 300 ట్యాంకులు నిరుపయోగమయ్యాయి. అసంపూర్తి పనులు పూర్తి చేయకపోవడంతో వేసవిలో పుంగనూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రమై నీటిని కొనుగోలు చేసే దుస్థితి దాపురించనుంది.

ఆర్వో ప్లాంట్ల నిర్మాణం

నియోజకవర్గంలో ఎంపీ మిథున్‌రెడ్డి నిధుల నుంచి గ్రామీణ ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించేందుకు 114 ఆర్వో ప్లాంట్లను నిర్మించారు. ఇందుకుగాను రూ.7 కోట్లు ఖర్చు చేశారు. ఆర్వో ప్లాంట్లకు, జలజీవన్ మిషన్ కింద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి నీటిని నేరుగా సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్యాంకులకు నీరు లేకపోవడంతో ఆర్వో ప్లాంట్లు సైతం నిరుపయోగంగా మిగులుతున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు ఉన్నాయి.

పైపులైన్లు...

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపేందుకు సమీప ప్రాంతాలలో బోర్లు వేసి, పైపులైన్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పైపులైన్లు వేసి ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటిని పంపిణీ చేసేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం అర్ధంతరంగా ఆగిపోయింది. వీటి నిర్వహణను పంచాయతీ వారు చూసుకునేలా ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీటి సమస్య తప్పడం లేదు.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

వేసవి తీవ్రంగా ఉండడంతో జలజీవన్ మిషన్ కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని విడుదల చేసేందుకు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ఎంతో ఉన్నత ఆశయంలో ప్రతి చిన్న గ్రామంలోనూ ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించిన పంచాయతీ, మండల, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని విడుదల చేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి వనరుల వివరాలు

మొత్తం ట్యాంకులు :	529
నిర్మాణం ఖర్చు :	రూ.87 కోట్లు
చిన్నట్యాంకుల సామర్థ్యం :	30 వేల లీటర్లు
పెద్దట్యాంకుల సామర్థ్యం :	2 లక్షల లీటర్లు
ఒక్కొక్క ట్యాంకు నిర్మాణ ఖర్చు	రూ.20 లక్షలు

ట్యాంకులు కూల్చారు!

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే రొంపిచెర్ల మండలంలో నిర్మిస్తున్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను జేసీబీలతో కూల్చివేశారు. అలాగే పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ట్యాంకులకు సంబంధించిన ఇసుక, సిమెంటు, కంకర, స్టీలు తదితర వస్తువులను రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లిపోయారు. దీంతో సుమారు 40 ట్యాంకుల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది.



రొంపిచెర్ల మండలంలో కూల్చివేసిన ఓవర్‌హెడ్ ట్యాంకులు(ఫైల్)

అడ్డదారిలో నెగ్గడమూ ఒక గెలుపేనా?

- తాళ్లపల్లి ఉప సర్పంచ్ పదవి టీడీపీ సొంతం
- గెలుపు కోసం అడ్డదారులు తొక్కిన పచ్చపార్టీ

గంగవరం: అడ్డదారిలో తాళ్లపల్లి ఉప సర్పంచ్ పదవిని టీడీపీ కైవశం చేసుకుంది. మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలు గత గురువారం జరగాల్సి ఉండగా కోరం లేక ఆగిపోయింది. మళ్లీ శుక్రవారం రోజున అదే పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలను అధికారులు నిర్వహించారు. ఇందులో వార్డు సభ్యుల మద్దతు శాతం టీడీపీకి లభించడంతో ఆ పార్టీ మద్దతుదారు భారతమ్మకు ఉప సర్పంచ్ పదవి దక్కింది. ఈ పంచాయతీలో ఉపసర్పంచ్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే టీడీపీ పన్నాగం మొదటి రోజున భగ్నమైంది. దీంతో వాయిదా పడిన ఎన్నికకు తమ పార్టీ మద్దతుదారు గెలుపు కోసం సరికొత్త ఎత్తుగడలు, వ్యూహాలను టీడీపీ నాయకులు ప్రదర్శించారు. అర్ధరాత్రి పై వరకూ పంచాయతీలో వార్డు సభ్యుల ఇళ్ల వద్ద పడిగాపులు కాసి, వైఎస్సార్ సీపీ మద్దతుదారులను తమకు మద్దతు తెలపాలంటూ ప్రలోభాలు, బెదిరింపులకు గురి చేశారు. చివరకు అడ్డదారిలో తమ పార్టీ మద్దతుదారు గెలుపొందారు. ఇలా జరిగిన ఎన్నిక కూడా ఒక గెలుపేనా? అని స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు. కాగా ఉప సర్పంచ్ భారతమ్మ ఏ పార్టీకి చెందిన వారో తమకు తెలియదని ఎంపీడీఓ సురేష్‌బాబు వివరణ ఇచ్చారు.

అందరికీ సంక్షేమ పథకాలు



నారా భువనేశ్వరి

శాంతిపురం: అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చెప్పారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆమె శుక్రవారం గుంజార్లపల్లి పంచాయతీలోని నక్కనపల్లిలో సెరికల్చర్ సాగును పరిశీలించి, మహిళలతో సమావేశమయ్యారు. మహిళలు నాణ్యమైన శిక్షణ పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ విజయరామిరెడ్డి, కడ పీఓ మర్మత్, ఎంపీడీఓ కుమార్ పాల్గొన్నారు.

పెనుమూరు బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ వేలం నిలుపుదల

- హైకోర్టు ఉత్తర్వులు జారీ
- స్థానికులు సంబరాలు



పెనుమూరు షాపింగ్ కాంప్లెక్స్

పెనుమూరు(కార్వేటినగరం): స్థానిక బస్టాండ్‌లోని వాణిజ్య సముదాయం గదుల వేలం ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 40 ఏళ్లుగా పెనుమూరు బస్టాండ్ స్థలం టీడీపీ నాయకులు ఆక్రమణలో ఉండేది. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి అప్పటి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే నారాయణస్వామి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. దీంతో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో పోలీసుల బందోబస్తు నడుమ ఆక్రమణలను తొలగించి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్‌రెడ్డి 24 గదులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా పూర్తి చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రారంభోత్సవం కాకపోవడంతో కూటమి నాయకులు ఈ నెల 19వ తేదీ వాణిజ్య సముదాయం గదులకు వేలం ప్రక్రియం ప్రారంభించారు. ఈ వేలంలో అవకతవకలు జరిగాయని మండలానికి చెందిన కే.కోదండన్, పి.చిన్నయ్య, ఇ.మునిరాజు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. వీరి తరఫున న్యాయవాది టీ.బాలాజీ వాదనలు వినిపించారు. దీంతో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ వేలం ప్రక్రియను ఆపివేయాలని న్యాయమూర్తి జి.రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను చిత్తూరు జిల్లా కలెక్టర్ స్వాధీనం చేసుకుని, కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. అప్పటి వరకు వేలం ప్రక్రియ ఆపివేయాలని, వేలంలో పాడుకున్న వారికి గదులు స్వాధీనం చేయకూడదని హైకోర్టు ఆదేశాల జారీ చేసింది.

తప్పుల తడక జాబితా ఎవరి కోసం?

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్టీయూ సంఘ నేతలు
- డీఈఓ కార్యాలయం వద్ద నిరసన



డీఈఓ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖాధికారులు సిద్ధం చేసిన తప్పుల తడకల సీనియారిటీ జాబితాలు ఎవరి కోసమని ఎస్టీయూ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంఘ నాయకులు శుక్రవారం డీఈఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్ల ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాలో అసంబద్ధతలు తొలగించి, ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనలకు తెరదించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు టీఐఎస్‌లో ఇచ్చిన వివరాలకు విరుద్ధంగా సీనియారిటీ జాబితా లున్నట్లు మండిపడ్డారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడుతూ మెరిట్, ర్యాంకు ఆధారంగా సీనియారిటీ జాబితాలు రూపొందించాల్సి ఉందన్నారు. అయితే అందుకు విరుద్ధంగా జాబితాలు రూపొందించారన్నారు.

వ్యయప్రయాసలకు గురి చేస్తున్నారు

విద్యాశాఖ అధికారులు టీచర్లను వ్యయప్రయాసలకు గురి చేస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి ఆరోపించారు. మహిళా టీచర్లు, అనారోగ్యంతో ఉన్నవారు కార్యాలయాల చుట్టూ అనివార్యంగా తిరగాల్సి రావడంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు.

అందుబాటులోని రికార్డుల మేరకే జాబితాలు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న రికార్డుల మేరకే సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసినట్లు డీఈఓ వరలక్ష్మి సంఘ నాయకులకు తెలిపారు. జాబితాలను ప్రాథమికంగా తయారు చేసి విడుదల చేశామని తెలిపారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీచర్ల అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, తుది సీనియారిటీ జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు మునప్ప మొదలి, రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు దేవరాజులు రెడ్డి , తిరుపతి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మునికృష్ణమ నాయుడు, ఆర్థిక కార్యదర్శి కటారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి



కృష్ణారెడ్డి మృతదేహం

సదుం: ఆటో ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ షేక్ షా వలి కథనం మేరకు.. అమ్మగారిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి(79) తన వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి పుంగనూరు–కల్లూరు ప్రధాన రహదారిపై నడుచుకుని గ్రామానికి వస్తుండగా గొంగివారిపల్లె వైపు నుంచి వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడికి బతికున్నంత వరకు జైలు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

చిత్తూరు అర్బన్: పెళ్లి పేరిట మైనర్ బాలికను లొంగదీసుకుని.. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో కె.దినేష్ (25) అనే నిందితుడికి బతికున్నంత వరకు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహన్‌కుమారి కథనం మేరకు.. గుడిపాల మండలం చిత్తపారకు చెందిన దినేష్ తిరుపతి నగరంలోని మంగళం వద్ద ఉంటూ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఇతనికి చిత్తూరు నగరానికి చెందిన 17 ఏళ్ల బాలికతో పరిచయమైంది. 2022 జనవరి 31 అర్ధరాత్రి బాలిక ఇంటికి వద్దకు వెళ్లి, ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి తీసుకెళ్లిపోయాడు. ఆమెను తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి తన లైంగికవాంఛ బయటపెట్టగా, బాలిక అంగీకరించలేదు. దీంతో కూల్‌డ్రింక్‌లో మత్తు పదార్థం ఇచ్చి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే తమ కుమార్తె కనిపించడంలేదని బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత బాలిక కనిపించడంలేదని కేసు నమోదు చేసిన పోలీసులు, ఆపై బాలిక ఆచూకీ కనిపెట్టి, విచారించగా జరిగిన ఘటన గురించి చెప్పింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో దినేష్‌కు ఐపీసీ 235 (2) సెక్షన్ కింద ఏడేళ్ల జైలుశిక్ష, బాలికను కిడ్నాప్ చేసినందుకు ఏడాది జైలుశిక్ష, బాలికపై లైంగికదాడికి పాల్పడినందుకు పోక్సోలోని 3 (ఏ), 4 ప్రకారం బతికున్నంత వరకు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, బాల్య వివాహ నిషేధిత చట్టంలోని సెక్షన్ 9 కింద రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఘర్షణ కేసులో నలుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేటలో శబరి అనే వ్యక్తిపై జరిగిన దాడి కేసులో మణి, పురుషోత్తం, శరవణ, జ్ఞానవేలు అనే నలుగురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. మంగసముద్రం ప్రాంతానికి చెందిన శబరిపై పాత గొడవ కారణంగా ఈనెల 20వ తేదీన నలుగురు వ్యక్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరచారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన తరువాత బాధితుడి భార్య లత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మంగసముద్రం బీడీ కాలనీకు చెందిన మణి, పురుషోత్తం, శరవణ, జ్ఞానవేలు అనే నలుగురిని అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జీవనోపాధి పెంపుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు

తవణంపల్లె: స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి పెంపుపై అవగాహన కల్పించాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం తవణంపల్లె వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు 2025–26 ఆర్థిక సంవత్సర రుణప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రుణప్రణాళిక సర్వే సభ్యురాలి జీవనోపాధికి ఆధారంగా ఏ,ఏ కార్యక్రమానికి ఎంత రుణం అవసరమో? సభ్యులతో చర్చించి, నమోదు చేయాలన్నారు. అలాగే సర్వేలో ఉన్న వారికి మాత్రమే ఈ ఆర్థిక సంవత్సరంలో రుణ సహాయం అందిస్తామన్నారు. ఈ రుణం అంతర్గత అప్పులు, సీఐఎఫ్, బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో ఏడాదిలో ఎంత మందికి ఈ నిధులు ద్వారా జీవనోపాధి కల్పించామని, అందులో సొంత అవసరాలకు ఎంత ఉపయోగించుకున్నారనే విషయాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. పుస్తక నిర్వహణ, రుణాలు రికవరీపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ మాస్ సంస్థ ద్వారా తవణంపల్లె మండలానికి ద్వితీయ బహుమతి రావడంపై వీఓఏలు, సిబ్బందిని అభినందించారు. అనంతరం తవణంపల్లెలోని మహిళా మార్ట్‌ని సందర్శించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం వైఎస్ రవికుమార్, ఐబీ డీపీఎం వెంకటేష్, ఐబీ జిల్లా యాంకర్ పర్సన్ సుబ్బారెడ్డి, డీఎంజీ శంకర్, ఏపీఎం రవి, ఎంఎస్ అకౌంటెంట్ రీటా పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలరాజు నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు నాయుడు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గంలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా కే వెంకటేష్, కార్యదర్శిగా ఎం.రాధ, కోశాధికారి నిజాముద్దీన్, చిత్తూరు శాఖ అధ్యక్షుడిగా కె .జయచంద్రకుమార్, కార్యదర్శిగా మధుమాలతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులైజేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో శోభ, సుచరిత, ధనలక్ష్మి, జయ కుమార్, రామకృష్ణమ్మ, ఫాతిమా, జగదీష్‌లు పాల్గొన్నారు.

భద్రత కల్పించాలి

బంగారుపాళెం: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వారికి భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బంగారుపాళెం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కూలీలుగా కాకుండా ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి భారతి, కోశాధికారి హనుమంతు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్ పాల్గొన్నారు.

లోకాయుక్తను ఆశ్రయిస్తే పరిహారం

కర్నూలు(సెంట్రల్): పిడుగుపాటు బాధిత కుటుంబాలు నేరుగా లోకాయుక్తను ఆశ్రయించి, పరిహారం పొందాలని ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజనీ సూచించారు. ప్రభుత్వం సకాలంలో పరిహారం ఇవ్వపోతే, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. చిత్తూరు జిల్లా తిప్పిరెడ్డిపల్లెకు చెందిన ఎం.వరలక్ష్మి భర్త ఎం.రామకృష్ణ, ఇద్దరు కుమార్తెలు పిడుగు పడి చనిపోయారు. ఆమెకు ఎలాంటి పరిహారం అందలేదు. దీంతో ఆమె లోకాయుక్తను ఆశ్రయించడంతో డైరెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చి పరిహారం మంజూరయ్యేలా ఉపలోకాయుక్త కృషి చేసింది. ఈక్రమంలో ఇటీవల ఒక్కొక్కరికీ రూ.4లక్షలు చొప్పున ముగ్గురికి రూ.12 లక్షలను మంజూరు చేసి, వరలక్ష్మి ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఉపలోకాయుక్త శుక్రవారం కేసును మూసివేసి పరిహారం కోసం నేరుగా లోకాయుక్తను ఆశ్రయించాలని పిడుగుపాటు బాధిత కుటుంబాలకు సూచించారు.

ఏనుగుల బెడద నుంచి రక్షించండి



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

యాదమరి: ఏనుగుల బెడద నుంచి తమని రక్షించి ఆదుకోవాలని మండలంలోని దళవాయిపల్లి, తాళ్లమడుగు, మాదిరెడ్డిపల్లి, నడుమూరు వాసులు కోరారు. శుక్రవారం చిత్తూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ భరణికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా తమ గ్రామాలపై ఏనుగుల వచ్చి పడుతున్నాయన్నారు. దాదాపు 24 ఏనుగుల వరకు పగలు నుంజర్ల ప్రాజెక్టు వద్ద సేదతీరి, రాత్రయితే తమ గ్రామాల్లోకి ప్రవేశించి పొలాలను ధ్వంసం చేస్తున్నాయని చెప్పారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఏనుగుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతున్నా ప్రభుత్వం నుంచి తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పినా ఇంత వరకూ అందించలేదని చెప్పారు. దీనిపై స్పందించిన జిల్లా అటవీశాఖ అధికారి భరణి మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి ఏనుగుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఏనుగులను కట్టడి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, మొరార్జీ యాదవ్ తదతరులు పాల్గొన్నారు.